క్లుప్తంగా

కొనసాగుతున్న ధనుర్మాస వ్రతం

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తిరుప్పావై ధనుర్మాస వ్రతం కొనసాగుతోంది. ఈ సందర్భంగా నల్లాన్‌చక్రవర్తుల రామకృష్ణమాచార్య తిరుప్పావై ప్రవచనాలు చేస్తున్నారు. ఈమేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేసే పనిని న్యాయంగా చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. సమాజంలో ఉండే మనుషులతో పాటు ప్రాణులన్నీ భగవత్ స్వరూపాలని భావించాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఒగ్గు పుల్లారెడ్డితో పాటు బొల్లారెడ్డి వసంతలక్ష్మి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, చెన్నారెడ్డి, ఎరసాని కేశవరెడ్డి, కోటిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కొప్పుల రాఘవరెడ్డి, సంజీవరెడ్డి, గోర్ల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల (ఖమ్మం) నందు పీఈటీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సైదులు తెలిపారు. ఎంపీఈడీ, ఎన్ఐఎస్ అర్హతలు గల వారు ఈ నెల 9లోగా దఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7331170861 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెస్పీ నాయకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ)ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెస్పీ మండల కన్వీనర్ మేకల రమేష్ మాదిగ, వికలాంగుల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాదిగ జెండా ఆవిష్కరించారు. ఈ సమావేశానికి విచ్చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జీ కూరపాటి ప్రభాకర్ మాదిగ మాట్లాడారు. ఎమ్మెస్పీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ వరయ్య మాదిగ, నాయకులు క్రాంతిమాదిగ, వెంకటేశ్వరరావు, పోతయ్య తదితరులున్నారు.

ప్రసాదరావు సేవలు అభినందనీయం



ప్రసాదరావు దంపతులను సన్మానిస్తున్న తపాలా ఉద్యోగులు

ముదిగొండ: 45 సంవత్సరాలుగా సుదీర్ఘకాలంగా తపాలా శాఖలో పనిచేసిన పొనుగోటి ప్రసాదరావు సేవలు అభినందనీయమని ఖమ్మం నార్త్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పండ్రేగుపల్లిలోని పోస్టుమాస్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పొనుగోటి ప్రసాదరావును గురువారం తపాలా ఉద్యోగులు, గ్రామస్తులు, ప్రజాప్రనిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరయ్య, నేలకొండపల్లి మార్కెట్‌కమిటీ డైరెక్టర్ శిల్వరాజు, తపాల ఉద్యోగులు, ఉద్యోగసంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

కల్లూరు: కల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది నగేష్ ఆధ్వర్యంలో వర్షిత జ్యూలరీషాప్ యజమాని లంక అప్పలనాయుడు కుమార్తె లంక హేమవర్షిణి జన్మదినం సందర్భంగా గురువారం కణాలీవాడ పాఠశాల విద్యార్థులకు పెన్నుల, నోటు పుస్తకాలు, కాపీరైట్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరైజర్లు, చాక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి దారా సురేష్, కోశాధికారి గంగుల నారాయణరావు, సభ్యులు లంకా అప్పలనాయుడు, రాయల సత్యనారాయణ, పుల్లారావు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనం అదుపు తప్పి పడడంతో ఓ మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కిష్టారం గ్రామానికి చెందిన సూరటి లక్ష్మి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేతన.. యాతన



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది (ఫైల్)

- ఐదు నెలలుగా వేతనాలు అందని పారిశుద్ధ్య సిబ్బంది
- కలెక్టర్ ఆదేశాలూ బేఖాతర్..
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్మికులు

నెలంతా పడిన కష్టానికి వచ్చే జీతం కాస్త ఆలస్యమైతేనే కుటుంబ నిర్వహణ భారమై ఒత్తిడికి లోనవుతుంటాం. అలాంటిది ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఐదు నెలలుగా వేతనాలందక సిబ్బంది పడుతున్న వేదన మాటల్లో వర్ణించలేనిది. రోగులకు మెరుగైన సేవలందించడంలో కీలకపాత్ర పోషించాల్సిన వీరు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు సేవలు అందించటం.. ఆస్పత్రి ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించే ఆస్పత్రి పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు అందక దినదినగండంగా గడపాల్సివస్తోంది. సత్తుపల్లి, పెనుబల్లి ఏరియా ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందకపోవటంతో పూటగడవటం కష్టంగా ఉందని వాపోతున్నారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా విధులు నిర్వహిస్తున్న వీరికి గతేడాది ఆగస్టు నెల నుంచి వేతనాలు నిలిచిపోయాయి. ఇటీవల ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన కలెక్టర్ వీపీ గౌతమ్‌కు పారిశుద్ధ్య సిబ్బంది తమగోడు చెప్పటంతో వెంటనే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి పక్షం రోజులైనా ఇంతవరకు వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. పని చేసిన నెలవారీ వేతనం అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంలోనైనా ఖర్చుల కోసం ఇస్తారనుకుంటే అలా కూడా కరుణించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన వేతనాలు అందలేదు..

ఆస్పత్రి పారిశుద్ధ్య సిబ్బందికి నెలకు రూ.7,500 చొప్పున పాతవేతనం ఉండగా.. రూ.1,000 కోతపెట్టి రూ.6,500 చొప్పున ప్రైవేట్ ఏజెన్సీ వేతనం ఇస్తోంది. అక్టోబర్ నెల నుంచి ప్రభుత్వాస్పత్రిలో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందికి రూ.15,440గా వేతనం పెంచి జీఓ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన పాతవేతనాలే ఇంతవరకు రాలేదని.. పెరిగిన కొత్తవేతనాలు జాడే లేదని సిబ్బంది వాపోతున్నారు. ఇంట్లో గడవటం లేదని, సరుకులు కొనలేని పరిస్థితి ఉంటుందని లబోదిబోమంటున్నారు. వడ్డీలకు తెచ్చి కుటుంబాలకు పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోతే ఎలా గడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. పిల్లల చదువుల ఖర్చులు, ఇంటిభారంతో సతమతమౌతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి

ప్రభుత్వాస్పత్రి	సిబ్బంది
సత్తుపల్లి	23 మంది
పెనుబల్లి	23 మంది

చాలా ఇబ్బంది పడుతున్నాం..



గత ఐదు నెలల నుంచి జీతాలు రావటం లేదు. కుటుంబాలు గడవటం కష్టంగా ఉంది. ఇన్ని నెలలు జీతాలు రాకపోతే సరుకులు తెచ్చుకోవటం, పిల్లల చదువులకు చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే వేతనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– ఎస్‌కే ఖాసీంబీ, పేషెంట్‌కేర్ సిబ్బంది, సత్తుపల్లి

జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాల్సిందే..



ప్రభుత్వాస్పత్రిలో పని చేసే పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులకు జీఓ నంబర్ 31 ప్రకారం నెలనెలా కోతలు లేకుండా వేతనాలు ఇవ్వాలి. యూనిఫాంలు, ఐడీ కార్డులు, ఓటీలు సక్రమంగా ఇవ్వాలి. పనులు చేసేందుకు మౌళిక సదుపాయాలు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌లు చెల్లించాలి.

– ఎ.శరత్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు, సత్తుపల్లి

మహాసభలను జయప్రదం చేయండి



వైరా: టీజేఎఫ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను గురువారం మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ఆవిష్కరించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజేఎఫ్ వైరా డివిజన్ అధ్యక్షుడు సూతకాని ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి పాటు పడుతున్న టీజేఎఫ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు గ్రామీణ జర్నలిస్టులు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు చింతల వసంతరావు, సత్తెనపల్లి లక్ష్మణాచారి, నెమలికొండ గోవిందాచారి, యస్ నరసింహారావు, గోవిందు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర సభలను..



కారేపల్లి హైస్కూల్‌లో యూటీఎఫ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కారేపల్లి: ఈ నెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడ, సాగర్‌రోడ్డు నందు జరిగే 5వ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకులు కారేపల్లి హైస్కూల్‌లో వాల్ పోస్టర్లను విడుదల చేసి గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డి.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, బి.మంగీలాల్, శిరీష, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారిగా అవినాష్



అవినాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారిగా అవినాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారిగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ప్రమీలా, హెచ్ఎస్ నర్సింహారావు, హెచ్ఏ సతీష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగసాని మార్క్‌లిన్, మల్లారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బెల్లంకొండ కోటయ్య కుటుంబ సభ్యులను గురువారం సత్తుపల్లి శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, నీలాద్రి ఆలయ డైరెక్టర్ నాగేశ్వరరావు, భద్రరాజు, కాంపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సండ్ర నివాళి..



పాస్టర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు రూరల్: మండలంలోని కొత్త ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ కావూరి సుధాకర్ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సండ్ర ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామారావు, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌కుమార్, సర్పంచ్ సింగిసాలపద్మ ప్రసాద్, పాస్టర్లు ఎనోస్‌కుమార్, జర్మీబాబు, నాయకులు పాల్గొన్నారు.

సులభతరంగా బోధన చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ సౌభాగ్యం

బోనకల్: విద్యార్థులకు సులభతరంగా బోధన చేయాలని ఎంపీపీ కంకణాల సౌభాగ్యం అన్నారు. మండలంలోని కలకోట ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా గురువారం తరగతుల నిర్వాహణ గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు చతుర్‌వర్ణమాల నేర్పాలని, ఇంగ్లీష్ మీడియంలో తేలిక పదాలను నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దయామణి, కార్యదర్శి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వననర్సరీల పరిశీలన

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి, యడవల్లి, యడవల్లిలక్ష్మీపురం గ్రామాల్లోని వన నర్సరీలను గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. వననర్సరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

చింతకాని: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని కెరీర్ గైడ్ కిషోర్ బాబు తెలిపారు. గురువారం మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు ఇండియా లీటరసి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. వివిధ కోర్సుల వలన కలిగే అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్


మధిర: ఈ నెల 18 నుంచి మండలంలో ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ కోరారు. దెందుకూరు పీహెచ్‌సీలో గురువారం ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో విజంభిస్తున్న క్షయ వ్యాధిని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీల సమ్మె విరమణ

మధిర: కూలీ రేట్లు పెంచాలని కోరుతూ తాపీ మేస్త్రీలు ఈ నెల 1 నుంచి చేపట్టిన సమ్మె గురువారం నుంచి విరమించారు. ప్రతీ సంవత్సరం కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ తాపీ మేస్త్రీలు జనవరి 1 నుంచి సమ్మెలోకి వెళతారు. ఈ క్రమంలో ఏడాది కూడా చేపట్టిన సమ్మెతో తాపీ మేస్త్రీకి రోజుకు రూ.850 కూలీ, పని కార్మికుడికి రూ.600 ఇచ్చే విధంగా జరిపిన చర్చలు ఫలించాయి. అనంతరం కూలీలందరు కలిసి యూనియన్ అధ్యక్షుడిగా సంగు సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పుల్లూరు రవి, కోశాధికారిగా చంద్రయ్యను ఎన్నుకున్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడుతాం

సత్తుపల్లి: రాష్ట్రంలోని కేసీఆర్ సర్కార్ ఉద్యోగాల నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షల తేదీ క్యాలెండర్‌ను ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన పోరాడుతామని బీజేపీ సత్తుపల్లి నియోజకవర్గ పాలక్ రామచంద్రయ్య హెచ్చరించారు. సత్తుపల్లిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వని టీఆర్ఎస్ సర్కార్ అదరాబాదరాగా ఇప్పుడు నోటిఫికేషన్లు ఇస్తూ పరీక్షల తేదీలను ప్రకటించకుండా నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడుతుందని విమర్శించారు. అనంతరం పాలక్ రామచంద్రయ్యను ఖమ్మంపార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీనివాసరావు, ఆచంట నాగస్వామి, రహీంతుల్లా, నారాయణరెడ్డి, వెంకటాచారి, శివకృష్ణ పాల్గొన్నారు.



పాలక్ రామచంద్రయ్యను సన్మానిస్తున్న దృశ్యం

రైతు బంధు అమలు చేయాలి



వైరా: వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా/ఏన్కూరు: పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు ప్రభుత్వం రైతు బంధు అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు యంగళ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 100 యూనిట్ల దళితబంధు ఇచ్చి దళితులు జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్ రెండో విడత దళితబంధు విడదల చేయడం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. దళితబంధు ఇవ్వకపోతే దళితులు ఓటుతో రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామారావు, చలపతిరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, నాగేశ్వరరావు, అరుణ, సుధాకర్, రమణ, రవీందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న నున్నా నాగేశ్వరరావు

ఏన్కూరు: వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన వడ్లు కల్లాల్లో ఆరబెట్టుకొని అనేక రోజులు అవుతున్న కొనుగోళ్లు చేయడం లేదన్నారు. అధికారులు చొరవ తీసుకొని కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరభద్రం, నాగేశ్వరరావు, బాలాజీ, రాములు, లక్ష్మా, లెనిన్ పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి



తల్లాడ: సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

తల్లాడ/కల్లూరురూరల్: మండలాల్లో శుక్రవారం జరిగే మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌కుమార్‌లు తెలిపారు. గురువారం తల్లాడ సొసైటీ కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నూతనంగా మంజూరైన మల్లారం –గంగదేవిపాడు రోడ్డు, కుర్నవల్లి – ఉమ్మడ దేవరపల్లి రోడ్డుకు, కల్లూరులో 20కోట్లతో నిర్మాణం చేయనున్న బీటీ రోడ్ల నిర్మాణాలకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లచే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లాడలో మధ్యాహ్నం 2 గంటలకు మల్లారం సబ్ స్టేషన్ వద్ద జరిగే సభను విజయవంతం చేయాలన్నారు. కల్లూరులో పూర్తైన పనులను నాయకులు పరిశీలించారు. ఆయా సమావేశాల్లో నీలాద్రి ఆలయ డైరెక్టర్ పెరికె నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, మూకర ప్రసాద్, రాయల నరసింహారావు, చల్లా నాగులు, దేగల సురేష్, ఇశ్రాయేల్, ఆర్అండ్‌బీ ఎస్సీ లక్ష్మణ్, ఈఈ హేమలత, డీఈఈ శంకర్‌రావు, ఏఈ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగుదారులకు పట్టాలివ్వాలి

పెనుబల్లి: ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తిరుపతిరావు, విశ్వనాథం, మంగమ్మ, సత్యనారాయణ, రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

సత్తుపల్లిటౌన్: సరస్వతీ అమ్మవారు, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రేంజర్ల రాజేష్, కొందరు వ్యక్తులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు అప్పారావు, కె.జగన్మోహన్‌రావు, నాగభూషణం, ఎంఎస్ఆర్ శర్మ, వినోదరావు, నర్సింహారావు, మల్లికార్జున్‌రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న వేణుగోపాల్

సత్తుపల్లిరూరల్: బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్ నిర్వహించిన పోటీల్లో సత్తుపల్లిలోని త్రివేణి టాలెంట్ స్కూల్ అవార్డుకు ఎంపికైంది. విద్యార్థులకు బోధన, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాల్లో పోటీ జరగగా, హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో త్రివేణి ప్రిన్సిపాల్ మిరియాల వేణుగోపాల్ అవార్డు అందుకున్నారు. ఆయనను డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీష్, జోనల్ ఇన్‌చార్జ్ కాట్రగడ్డ మురళీకృష్ణ, తల్లిదండ్రులు అభినందించారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలయంలో బాబాకి పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, భీమవరం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం సాయినాథునికి ఆలయాల అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని బాబా ఆలయంలో కామిశెట్టి రామ్మోహన్ – ప్రభావతి దంపతులు, పమిడిమర్రి మురళీకృష్ణ – లక్ష్మీతులసి దంపతులు, ఉమ్మా వీరారెడ్డి – రాజ్యలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఏటీఎం అలంకారప్రాయమే..



ముదిగొండ కేంద్రంలో ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం పని చేయక ఆరు నెలలు కావస్తున్నా, సంభందిత బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఏటీఎం సేవలు అందకపోయినప్పటికీ నిత్యం ఏటీఎం తెరచి ఉంచడం, దానికి రెంటు, కరెంటు బిల్లు, ఏసీ వగైరా అన్నీ చెల్లించాల్సిందేగా మరి అని వినియోగదారులు అనుకుంటున్నారు. ముదిగొండలో జనం రద్దీగా ఉండే ప్రదేశంలో వివిధ పనుల నిమిత్తం డబ్బులు డ్రా చేసేందుకు వచ్చి ఏటీఎం పని చేయకపోవడంతో వెనుదిరిగి వెళుతున్నారు. అలంకార ప్రాయంగా ఉన్న ఏటీఎంను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

- ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : బి.వీరమ్మ, యూనియన్ బ్యాంకు మేనేజర్, మేడేపల్లి
సెల్ నంబర్ : 9494866213